కాలభైరవస్వామి!

శ్రీరాజ్

"డ్రైవర్!" బిగ్గరగా కేక వేశాడు విశ్వనాధరావు వరండా మెట్లు దిగుతూ.

ఓ ప్రక్కగా కూర్చుని బీడి తాగుతున్న డ్రైవర్ బీడి అవతల పారేసి, గబగబా కారు దగ్గరకు వచ్చి బాక్ డోరు తెరచి పట్టుకు నుంచున్నాడు.

విశ్వనాధరావు కారులో కూర్చోగానే డ్రైవర్ కారు స్టార్టు చేసి మెయిన్ గేటు వైపు తిప్పాడు.

కారు గేటు దాటుతూండగా కాషాయ వస్త్రాలు ధరించి, చేతిలో కమండలం, మెడలో రుద్రాక్షమాల, పొడుగాటి గడ్డంతో గంభీరంగా వున్న ఒక సాధువు కారుకి ఎదురుగా వచ్చి, ఆపమని సంజ్ఞ చేశాడు.

కారు ఆగగానే సాధువు, విశ్వనాధరావు కూచున్న వెనక సీటు దగ్గరకు వచ్చి, "మీరు యింకొక అరగంట దాకా బయటకు పోకూడదు" అన్నాడు.

'ఏం' అన్నట్లు చూశాడు చిరాగ్గా విశ్వనాధరావు.

"ఇప్పుడు సమయం ఎంత?" ప్రశ్నించాడు సాధువు.

"గం. 10-05 లు" అన్నాడు విసుగ్గా వాచీ వంక చూస్తూ.

"సరిగ్గా గం. 10-28 లకు మీ కారు ఏక్సిడెంటు అవుతుంది" అన్నాడు అతను తాపీగా.

"ఇది చెప్పటానికా కారు ఆపింది. పోయి రోడ్డు ప్రక్కన కూర్చొని చిలక జోస్యం చెప్పుకో. నాలుగు డబ్బులయినా వస్తాయి. ఫో, ఫో" అని డ్రైవర్ వైపు తిరిగి "డ్రైవర్ పోనియ్యి" అన్నాడు.

2

కారు స్పీడుగా వెళ్తోంది.

సమయం గం. 10-25 ని.లు అయింది.

"డ్రైవర్, ఎందుకయినా మంచిది కొంచెం మెల్లగా పోనియ్యి. వెధవ శకునపక్షిలావచ్చి అపశకునం మాట్లాడాడు" అన్నాడు విశ్వనాధరావు చికాకుగా.

"ఏం సార్! వాడి మాటలు మీరు నమ్ముతున్నారా! పన్నెండేళ్ళనుంచి మీ దగ్గర పని చేస్తున్నాను. కారుకి చిన్న గీతయినా పడనిచ్చానా. వాడి మాటలు గురించి మీరేమీ బాధపడకండి సార్!" అన్నాడు డ్రైవర్.

"అది కాదు డ్రైవర్, నీ డ్రైవింగ్ లో లోపం వున్నదని కాదు. వాడి చెడు మాటలు నిజంగానే పని చేస్తాయేమోనని ముందు జాగ్రత్త కోసం చెపుతున్నాను, అంతే" అన్నాడు.

విశ్వనాధరావు మాట్లాడుతుండగానే డ్రైవర్ టర్నింగ్ తిప్పాడు కారుని.

అంతే! అప్పుడే అటునుంచి వస్తున్న రిక్షా కారు ముందు రెండు చక్రాలకి అతుక్కుపోయింది. విశ్వనాధ

రావు ఒక్కసారిగా కళ్ళు బైర్లు కమ్మినట్లయిపోయినాయి.

నిమిషంలో కారు చుట్టూతా జనం గుమిగూడి పోయారు.

అంతలో సాధువు చెప్పిన మాటలు గుర్తుకు వచ్చి గడియారం వంక చూసుకున్నాడు. సరిగ్గా 10-28 అయింది.

రోడ్డుమీద జనం ఎక్కువమంది పోగవటం చూసి కారులోంచి దిగి బయటకు వచ్చాడు. ఏక్సిడెంటు అయిన రిక్షావంక చూశాడు. ఇంకానయం రిక్షా ఒక్కటే పాడయిపోయింది. రిక్షా డ్రైవరుకు ఎక్కువగా దెబ్బలేమీ తగల్లేదు.

ఇంతలో ట్రాఫిక్ పోలీసు వచ్చి తన పని చేసుకుపోసాగాడు.

విశ్వనాధరావు పోలీసు దగ్గరకు వచ్చి కాసేపు ఏదో మాట్లాడాడు. అక్కడ గుమిగూడిన జనాన్ని తరిమేశాడు పోలీసు.

రిక్షా రిపేరు కోసం, రిక్షా అతనికి తగిలిన కొద్దిపాటి గాయాలను నయం చేసుకోవటానికిగాను నాలుగు వందలు అతని చేతిలో పెట్టి బయట పడ్డాడు విశ్వనాధరావు.

3

వారం రోజుల తర్వాత విశ్వనాధరావు కుటుంబ సమేతంగా గ్రామంలో వున్న తమ్ముడి కొడుకు పెళ్ళికిబయలుదేరాడు.

కారు సరిగ్గా మెయిన్ గేటు దగ్గరకు రాగానే మళ్ళీ సాధువు ఎదురు వచ్చాడు.

సాధువుని చూడగానే డ్రైవర్ తనంతట తానే కారుని ఆపాడు.

సాధువు విశ్వనాథరావు దగ్గరకు వచ్చాడు.

"ఏం, మళ్ళీ ఈసారి ఏ ఏక్సిడెంటు తీసుకువచ్చావు?" అడిగాడు విశ్వనాథరావు సాధువు వంక కోపంగా చూస్తూ.

సాధువు చిరునవ్వు నవ్వి "నేను తీసుకువచ్చేది ఏమీ లేదు నాయనా! అంతా విధిలీల. శివుని ఆజ్ఞ లేనిదే చీమ అయినా కుట్టదు. కాని ఆ చీమ ఎప్పుడు కుడుతుందో, ఎప్పుడు ఏం జరుగుతుందో సాధారణంగా ఎవరికీ తెలియదు.

కాని నేను కొన్ని ఏళ్ళ తరబడి శివధ్యానం చేస్తూ, శివుడే లోకంగా స్మరిస్తూ ఉండడంవలన నాకు కొద్దిగా దైవాంశ ప్రాప్తించింది. నాకు తెలిసినదానివల్ల ప్రజల కోసం పాటుపడమని శివుడు నన్ను ఆదేశించాడు. చేస్తున్నాను. అంతేగాని మీరనుకున్నట్లు సాధారణ సాధువుని కాదు.

ఇకపోతే మీరు ఎక్కడకు పోతున్నారో నాకు తెలుసు. వెళ్ళేవాళ్ళని ఆపటం నాకు యిష్టం లేదు. కాని మీరు వెళ్ళేచోట మీకు వూహించని ఆపద ఎదురవుతుంది. ప్రాణాపాయం కలుగుతుంది..." అంటూ సాధువు ఒక పొట్లం విశ్వనాథరావు చేతిలో పెట్టేసి వడివడిగా వెళ్ళిపోయాడు.

డ్రైవర్ కారును ముందుకు పోనిచ్చాడు.

సాధువు యిచ్చిన పొట్లం బయటకు విసరబోయాడు విశ్వనాథరావు. కాని అంతలో పొట్లం మీదున్న అక్షరాలు చూసి ఆగిపోయాడు.

"విషహారిణి" అని వ్రాసి, దానిక్రిందగా "కొద్దిగా మంచినీళ్ళలో చిటికెడు 'విషహారిణి' కలిపి తాగితే ఎటు

వంటి విషాన్ని అయినా హరిస్తుంది'' అని వ్రాసి వుంది.

అది చదివిన తరువాత ఆలోచనలో పడ్డాడు విశ్వనాథరావు.

ఈ విషహారిణి తనకు ఎందుకు యిచ్చాడు సాధువు? అసలు ఈ సాధువు ఎవరు? ఎందుకు నా గురించి ప్రత్యేకంగా పని కట్టుకొని వచ్చి, జరగబోయేవి చెపుతున్నాడు? దీని వెనక ఏమన్నా కుట్ర వున్నదా? లేకపోతే నన్ను మంచి చేసుకొని నా ఆస్థి కాజేయాలని చూస్తున్నాడా!

విశ్వనాథరావుకి కారుతోపాటు ఆలోచనలు కూడ ఆగిపోయినాయి.

కారు దిగి పెళ్ళి యింట్లోకి నడిచారు అందరూ.

ఎందుకయినా మంచిదని సాధువు యిచ్చిన పొట్లాన్ని జాగ్రత్తగా దాచిపెట్టుకొన్నాడు విశ్వనాథరావు.

4

పెళ్ళి హడావిడి తగ్గగానే తిరుగు ప్రయాణమవసాగాడు విశ్వనాథరావు.

అంతలో విశ్వనాథరావు తమ్ముడు వచ్చి ''అన్నయ్యా ద్రాక్షతోటను చూసి చాలారోజులయింది కదూ నువ్వు! కాసేపు అలా తోటదాకా వెళ్ళి, వచ్చేటప్పుడు ద్రాక్ష పండ్లు కోయించి తీసుకు వద్దాము పద'' అన్నాడు.

తోట దగ్గరకు అనగానే కాస్త తటపటాయించాడు విశ్వనాథరావు. సాధువు యిచ్చిన విషహారిణి జ్ఞాపకం వచ్చింది. అంటే తనకు 'విషపురుగు' హాని ఏమన్నా కలుగుతుందా?

ఏమో! ద్రాక్ష తోటలో పెద్ద పాము పుట్ట కూడ

ఒకటి వున్నది. కాదు. కూడదు రానంటే తమ్ముడు ఏమను కుంటాడో!

అయినా తనకు భయం దేనికి? తోట దగ్గరకు వెళ్ళ గానే తోట కాపలావాళ్ళు మా ప్రక్కనే వుంటారు గదా! అని తనలో తనే ధైర్యం చెప్పుకొని తమ్ముడితో పాటు తోటకు బయలుదేరాడు విశ్వనాధరావు.

వీళ్ళిద్దర్నీ చూడగానే తోట కాపలావాళ్లు యిద్దరూ పరుగెత్తుకొని వచ్చారు.

"అరే అప్పన్నా! మంచి పండ్లుకోసి బుట్టల కెత్తండి. అన్నయ్య పట్నం తీసుకువెళతాడు" అని పురమాయిం చాడు విశ్వనాధరావు తమ్ముడు కాపలావాళ్ళకి.

కాపలావాళ్ళు అలా వెళ్ళిపోగానే విశ్వనాధరావుకి జంకు ప్రారంభమయింది. తనచుట్టూ వేయి కళ్లు చేనుకుని చూసుకుంటూ నడవసాగాడు.

అతని తమ్ముడు తోట గురించి చెప్పుకుపోతున్నాడు కాని అవేమి చెవికి ఎక్కటం లేదు. ఏ వైపునుంచి ఏమి వస్తుందో అని జాగ్రత్తగా చూసుకోసాగాడు.

అలా మాట్లాడుకుంటూ తోటంతా తిరగసాగారు.

"చీకటి పడకముందే బయలుదేరాలి మేము" అన్నాడు విశ్వనాధరావు.

"అదేమిటన్నయ్యా! అలా తొందరపడుతున్నావు ఈ సారి. ఎప్పుడొచ్చినా కనీసం వారం రోజులన్నా వుండి పోయేవాడివి. ఈసారి వచ్చినప్పటినుండి వెళ్తా, వెళ్తా నంటున్నావు" అన్నాడు తమ్ముడు ఆశ్చర్యంగా అన్న వంక చూస్తూ.

తోటంతా తిరిగివచ్చి వరండా బయట వేసిన కుర్చీలో కూర్చున్నారు. ఎదురుగా టీపాయ్‌మీద రెండుద్రాక్ష పండ్ల గుత్తులు పెట్టివున్నాయి.

"తీసుకో అన్నయ్యా! ఈ రెండు పండ్లూ నోట్లో వేసుకుని బయలుదేరదాము" అన్నాడు.

అప్పటికే సంధ్య చీకట్లు అలుముకొంటున్నాయి.

తోటవాళ్ళు పళ్ళ బుట్టలను కారు డిక్కీలో పెట్టి వచ్చారు.

ఇద్దరూ కారువేపు నడవసాగారు.

అంతలో విశ్వనాధరావు ఉలిక్కిపడుతూ పెద్దగా కేక వేసి కూలబడిపోయాడు.

అతని తమ్ముడుకి ఏమి అర్ధంకాక, కంగారుగా యేమిటని అడుగుతూ అటుయిటు చూసేడు.

ఆ మసక చీకటిలో అతనికి ఏమీ కనిపించలేదు. కాని ఏదో పాకుతున్నట్లు శబ్దం వినిపించింది.

"ఒరేయి, అప్పన్నా! త్వరగా టార్చి, కర్ర తీసుకు రండర్రా. పాము వచ్చింది" పిచ్చిగా కేకేశాడు విశ్వనాధరావు తమ్ముడు.

పనివాళ్ళిద్దరూ పరుగెత్తుకుంటూ వచ్చారు.

ఈలోపల తనపై ఉత్తరీయాన్ని తీసి పాము కరచిన చోటుకి కొద్దిగా పైభాగాన గట్టిగా బిగించికట్టాడు. అదే విధంగా కిందభాగాన్నికూడా కట్టాడు.

"ఒరేయి, ముందు అన్నయ్యని కారులో చేర్చండిరా. పాముల నరసయ్య దగ్గరకు తీసుకువెళ్దాము" అన్నాడు తమ్ముడు.

మంచినీళ్ళు తెమ్మన్నట్లుగా సైగచేశాడు విశ్వనాధరావు.

క్షణంలో మంచినీళ్ళ గ్లాసుతో ప్రత్యక్షమయ్యాడు అప్పన్న.

జేబులో చేయిపెట్టి సాధువు యిచ్చిన పొట్లాన్ని విప్పి ఆ పొడుము కొద్దిగా గ్లాసులో వేసి కలుపుకొని గడగడా తాగేశాడు.

రెండు నిముషాల్లో ఎంతో 'ఫ్రీ'గా ఉన్నట్లయింది విశ్వనాధరావుకి.

"తమ్ముడూ! పాముల నరసయ్య అవసరంలేదు" అన్నాడు లేచి సర్దుకు కూర్చుని.

"ఏమిటన్నయ్యా! ఇందాకట్నించి చూస్తూన్నాను. ఏదో వింతగా ప్రవర్తిస్తోన్నావు?" అన్నాడు తమ్ముడు తన అనుమానాన్ని బయట పెడుతూ.

అప్పుడు చెప్పాడు, అంతకుముందు సాధువు తనకు చెప్పినదాన్ని గురించి.

ఈ సంఘటనతో విశ్వనాధరావుకి సాధువుమీద గౌరవభావం కలగసాగింది.

5

విశ్వనాధరావు గ్రామంనుంచి తిరిగివచ్చి నాలుగు రోజులయింది. సాధువు మళ్ళీ కన్పించలేదు.

ముందర తను అతనిని ఒక సామాన్య సాధువుగా చూశాడేగాని, యింత మహత్తువున్న సాధువుగా తెలుసుకోలేక పోయాడు. ఒకవేళ అతనికి నా నిర్లక్ష్యం వల్ల నామీద కోపం వచ్చిందేమో. ఏది ఏమయినా ఆ సాధువును కలుసుకోవాలి.

'ఎలా కలుసుకోవాలి? ఎక్కడ కలుసుకోవాలి?' ఆలోచించ సాగాడు.

'ఆఁ! అవును. సామాన్యంగా సాధువులు గుళ్ళదగ్గర ధర్మసత్రాల దగ్గర వుంటారు. అక్కడకు వెళ్ళి వెతికితే?

అనుకున్నాడు. కానీ యింతలో మళ్ళీ యింకో అనుమానమొచ్చింది.

'అతను సామాన్య సాధువు కాదు, గుళ్ళదగ్గర, సత్రాల దగ్గర ఉండడానికి? ఏంచేయాలి?'

'అయినా ఒక్కసారి ఫూళ్ళోవున్న గుళ్ళదగ్గిరకి, సత్రాల దగ్గిరకు పోయి తిరిగొస్తే పోయేదేముంది?' అనుకొని లేచి తనొక్కడే కారులో బయలుదేరాడు.

రెండు గంటలసేపు తిరిగాడు. కాని ఎక్కడా ఆ సాధువు కనిపించలేదు.

ఆ రాత్రంతా సాధువుగురించి ఆలోచిస్తూ సరిగా నిద్ర కూడా పోలేదు.

మర్నాడు ఉదయం తొమ్మిదికల్లా తయారై డ్రైవరుతో సహా మళ్ళీ సాధువును వెతకటానికి బయలుదేరాడు. అప్పుడే పోస్ట్‌మాన్ వచ్చి, ఆరోజు 'పోస్ట్' యిచ్చి వెళ్ళాడు.

వరుసగా ఒక్కొక్క ఉత్తరంతీసి చదవసాగాడు విశ్వనాథరావు. అన్నీ చదివిన తరువాత చివరలో ఓ కవరు మిగిలిపోయింది. అదికూడా చించి చదవసాగాడు.

ఒక్కసారిగా విశ్వనాథరావు ముఖంలో ఆనందరేఖలు వెల్లివిరిశాయి.

''విశ్వనాథరావుకి,

ఆశీర్వచనములతో —

నేను రెండుసార్లువచ్చి నీకు మేలు చేద్దామనుకుంటే నన్ను చీదరించుకున్నావు. త్వరలో నీకు శుభం జరుగుతుంది. శుభవార్త వింటావు. ఆ విషయం విపులంగా చెప్పటానికివస్తేఈసారి నన్ను మెడపట్టి గెంటిస్తావేమోనని నేను రాకుండా ఈ ఉత్తరం ద్వారా తెలియపరుస్తున్నాను.

నీ ఆస్తి తాలూకు కేసు ఒకటి కోర్టులో నడుస్తున్నది. దాని తాలూకు ఆఖరి వాయిదా రేపున్నది. రేపు కోర్టులో న్యాయం నీ ప్రక్కన వున్నది. నీ దాయాదులు ఓడిపోతారు. అంటే నీకు అయిదు లక్షల ఆస్తి అదనంగా నీకున్న ఆస్తిలో చేరుతుంది.

రేపు నువ్వు కోర్టుకు వెళ్ళేటప్పుడు ఈ కవర్లో పంపిస్తున్న విభూదిని నొసట పెట్టుకొని వెళ్ళు. నీకు జయం కలుగుతుంది!

ఇట్లు,
"కాలభైరవస్వామి"

ఆ ఉత్తరం చదవగానే అది ఎవరు వ్రాశారో అర్థమయింది విశ్వనాథరావుకి. క్రింద అడ్రసు కోసం చూశాడు. కాని కాలభైరవస్వామి తన అడ్రసు ఏమీ వ్రాయలేదు.

నిజంగా రేపు కోర్టులో గెలుపు తనదేనా? ఆ సాధువు కాలభైరవస్వామి చెప్పినట్లు అదృష్టం తననే వరిస్తుందా!

నిజంగా రేపు సాధువు చెప్పినట్లు జరిగితే, ఆయనకు మంచి ఆశ్రమం కట్టించి, ఆయన శిష్యుడిగా చేరిపోయి ఆయన సలహాలు తీసుకుంటూ జీవితం నిశ్చింతగా గడపాలి.

కాని సాధువు అడ్రసు తనకు ఇవ్వలేదే! ఎట్లా కలుసుకోవాలి? ఆయనకు తన క్షమాపణ ఎట్లా తెలుపుకోవాలి?

మర్నాడు ఉదయమే లేచి, స్నాన సంధ్యాదులు ముగించుకొని సాధువును స్మరించుకొంటూ, ఆయన పంపిన విభూతిని నొసట పెట్టుకొని, తొమ్మిది గంటలకల్లా కోర్టుకి బయలుదేరాడు.

మధ్యాహ్నానికల్లా కోర్టు తీర్పు చెప్పింది.

కోర్టు తీర్పు విన్న తర్వాత విశ్వనాథరావు ఆనంద డోలికల్లో వూగిపోయాడు. ఆ సమయంలో గనక సాధువు అక్కడే వుంటే పూలవర్షంతో ముంచెత్తే వాడు. ఆయన అడిగింది కాదనకుండా యిచ్చేవాడు! కాని ఏడి? ఆయన జాడ తెలియదే! ఆలోచిస్తూ యధాలాపంగా వచ్చి కారులో కూర్చున్నాడు.

డ్రైవర్ కారు స్టార్టుచేసి పోనివ్వసాగాడు.

కారు రోడ్డుమీదకు వచ్చేసరికి భగవన్నామ సంకీర్తన చేస్తూ, చిన్న సాధువుల గుంపు పోసాగింది.

ఆ గుంపును చూడగానే విశ్వనాథరావు కారును ఆపించి దిగివెళ్ళి ఆ గుంపులో సాధువు గురించి వెదకసాగాడు.

ఒక్కసారి విశ్వనాథరావు కళ్ళు ఆనందంతో మెరిశాయి. ఆనందం పట్టలేక "స్వామీజీ" అని బిగ్గరగా అరిచాడు. సంకీర్తన ఒక్కసారిగా ఆగిపోయింది.

కాలభైరవస్వామి మెల్లగా తల తిప్పి విశ్వనాథరావు వంక చూశాడు.

విశ్వనాథరావు చేతులు జోడించి స్వామీజీకి నమస్కరిస్తూ "స్వామీ! నన్ను క్షమించండి! మీ మహిమ గ్రహించలేని మూర్ఖుడినై మిమ్మల్ని, మీ మాటల్ని తిరస్కరించాను. నా తప్పులు క్షమించండి స్వామీ" అని రోడ్డుమీదనే స్వామీజీ కాళ్ళపై బడ్డాడు.

"లే నాయనా! అంతా భగవంతుని లీల. ఆనాడు నీకు జ్ఞానోదయం అవలేదు. ఈనాడు నీకు జ్ఞానోదయం అయింది. కళ్ళు తెరచి 'నేను' ఎవరో తెలుసుకున్నావు.

యిక వెళ్ళు. నీకు అంతా మంచి జరుగుతుంది'' అని చెప్పి స్వామీజీ ముందుకు కదిలాడు.

''లేదు స్వామీ! మీ వెంట నేనూ వస్తాను. మీ శిష్యగణంలో చేరిపోతాను'' అన్నాడు విశ్వనాధరావు.

''నీకా అర్హత లేదు. నువ్వు యింకా పరిపూర్ణత పొందలేదు. ఆ రోజు వచ్చినప్పుడు తప్పకుండా నేనే పిలిచి నా శిష్యగణంలో చేర్చుకుంటాను'' అన్నాడు స్వామీజీ..

కాసేపు ఏం మాట్లాడాలో తెలియలేదు విశ్వనాధరావుకి. కొద్దిసేపటి తర్వాత ''పోనీ! అప్పటిదాకా మీ దర్శన భాగ్యం కలిగించండి ప్రతిరోజూ'' వేడుకున్నాడు.

''అలాగే. రోజూ ఉదయం ఎనిమిది గంటలలోపు అయితే నేను నీకు కనిపిస్తాను. ఆ తరువాత పరమేశ్వర సాంగత్యంలో వుండిపోతాను.''

''అలాగే స్వామీ! ప్రతిరోజూ ఉదయమే వచ్చి మీ దర్శనం చేసుకుంటాను'' అని చెప్పి స్వామీజీ వుండేది ఎక్కడో తెలుసుకుని వెనక్కి తిరిగాడు విశ్వనాధరావు.

కాలభైరవస్వామి శిష్యగణంతో మళ్ళీ భగవన్నామ సంకీర్తనం చేస్తూ కదలి వెళ్ళిపోయాడు.

6

ఇప్పుడు విశ్వనాధరావులో మార్పు కనపడసాగింది. అంతకు ముందు సాధువులంటే ఎంత నిర్లక్ష్యం చేసేవాడో యిప్పుడు అంత గౌరవిస్తున్నాడు. ప్రతిరోజూ వుదయాన్నే లేచి కాలభైరవస్వామి దర్శనం చేసుకొని వస్తున్నాడు.

వ్యాపారం కొడుకులకు అప్పజెప్పి, ఎక్కువ కాల
భగవన్నామ స్మరణలో కాలం గడపసాగాడు.

రోజులు, వారాలు గడవసాగాయి.

ఒకరోజు వుదయం ఆశ్రమంలో కాలభైరవస్వా
సన్నిధానంలో ఉండగా ఒక పదిమంది యువకు
వచ్చారు. వారిని చూస్తూనే ఆయన చిరునవ్వు నవ్వి
ఆహ్వానించాడు.

ఆ పదిమంది వచ్చి అక్కడ సమీపంలో క్రిం
పరచిన చాపలమీద కూర్చున్నారు.

"ఊఁ! యిప్పుడు చెప్పండి! అంతదూరం నుంచి ప
గట్టుకుని ఎందుకు వచ్చారు మీరు? మన ఆశ్రమం బా
నడుస్తున్నది కదా! విద్యార్థుల సంఖ్య పెరుగుతున్న
కదా! అందరూ క్రమం తప్పకుండా విధులు నిర్వహి
న్నారా?" స్వామీజీ వరుసగా అడగసాగాడు ఆ వచ్చి
వారి వంక చూస్తూ.

"స్వామీ! మీరున్నంతకాలం మన ఆశ్రమం ఎంత
కళకళలాడేది. మీరు ఆశ్రమ బాధ్యతలు మాకు అ
గించి యిక్కడకు వచ్చేసిన తరువాత కొంత కాలం వ
విధులు మేము క్రమం తప్పకుండా నిర్వహిస్తూ వచ్చావ

కాని రాను రాను దాతలు విరాళాలు యివ్వటం త
చేశారు. మీరున్న రోజుల్లో అయితే మీరు వె
కుండానే వారు తమ తమ విరాళాలను పూవులలో పె
తెచ్చి యిచ్చేవాళ్ళు. ఇప్పుడు మేము వెళ్ళి పదిసా
అడిగినా పది పైసలు రాల్చటం లేదు.

ఆశ్రమం నడపాలంటే చాలా బాధగా వున్న
ఉన్న విద్యార్థులకు అన్న పానాదులు లేక అలమటి

న్నారు. కొంతమంది ఆకలిబాధ భరించలేక చదువు మానుకుని దేశంమీద పడ్డారు.

మళ్ళీ మీరు ఆశ్రమం గురించి శ్రద్ధ వహిస్తేగాని, కుంటుపడ్డ ఆశ్రమం మళ్ళీ నాలుగు కాళ్ళమీద నడవలేదు'' అని తాము చెప్పదలుచుకున్నదంతా వివరంగా స్వామీజీకి చెప్పారు వాళ్ళు.

స్వామీజీ కాసేపు కళ్ళు మూసుకుని ఏదో ఆలోచించసాగాడు.

ఇదంతా విశ్వనాథరావుకి ఏమీ అర్థంగాక స్వామీజీనే అడిగాడు.

స్వామీజీ కళ్ళు తెరచి విశ్వనాథరావువంక చూశాడు. తను అంతకు ముందు స్థాపించిన ఆశ్రమం, దానిలో పేద విద్యార్థులకు వసతి సౌకర్యాలతో విద్యాబోధనం చేయటం అన్నీ వివరంగా చెప్పాడు.

“ఇప్పుడు వచ్చినవాళ్ళు నా ముఖ్యానుచరులు. వీళ్ళమీద ఆశ్రమ భారం వదలి, శివుడు ఆజ్ఞమీద యిలా తిరుగుతున్నాను'' అన్నాడు.

విశ్వనాథరావు ఆసక్తిగా వింటున్నాడు.

“ఇప్పుడు నా ఆశ్రమం నడక కుంటుపడింది. దాన్ని మళ్ళీ కళకళలాడేట్లు చేయాలి. దాని గురించే ఆలోచిస్తున్నాను. మళ్ళీ నా ఆశ్రమం కళకళలాడాలంటే డబ్బు కావాలి. డబ్బు కావాలంటే సంపాదన వుండాలి. నేను అన్నిటి మీద వ్యామోహం చంపుకుని యిలా వచ్చాను'' సాధువు చెప్పుకుపోతున్నాడు.

మధ్యలో విశ్వనాథరావు అందుకుని “స్వామీ! మీరు అనుగ్రహిస్తే ఆ ధన సహాయం నేను చేస్తాను'' అన్నాడు.

స్వామీజీ చిరునవ్వు నవ్వి, "ఇది నువ్వనుకున్నంత తేలిక కాదు. వందలు వేలతో యిది పునరుద్ధరణ కాదు. మళ్ళీ నా ఆశ్రమం కళకళలాడాలంటే కొన్ని లక్షలు కావాలి. వందలు, వేలు అయితే నువ్వు సర్దగలవు. కాని లక్షలలో యివ్వాలంటే నీకు సాధ్యపడదు. ఒకవేళ అది నీకు సాధ్యమవుతుందనుకున్నా నీ వారసులు అందుకు ఒప్పుకోరు" స్వామీజీ అన్నాడు.

విశ్వనాథరావు ఆలోచనలో పడ్డాడు. స్వామీజీ చెప్పింది నిజమే. వందలు, వేలు అయితే తను తెచ్చి యివ్వగలడు. లక్షలమీద యివ్వాలంటే కొడుకులతో సంప్రదించాలి, అందుకు వాళ్ళు ఒప్పుకోవాలి.

అసలు యిప్పటికే తనను హేళనగా చూస్తున్నారు తన కొడుకులు. స్వామీజీ దైవాంశగలవాడంటే, వాళ్ళు నమ్మడం లేదు.

"వృథా ఆలోచనలు చేయకు నాయనా! యిప్పుడు నువ్వు నీ కొడుకుల గురించి ఆలోచిస్తున్నావు. అందుకు వాళ్ళు ఏమాత్రం ఒప్పుకోరు" అన్నాడు స్వామీజీ విశ్వనాథరావు ఆలోచనలకు అడ్డు తగులుతూ.

"లేదు స్వామీ! ఏవిధంగానయినా మీకు డబ్బు సర్దుతాను."

"చూడు నాయనా! నా గురించి నువ్వు అప్పుచేసి, అనవసరంగా కష్టాలు కొనితెచ్చుకోవద్దు. జరగాల్సింది ఏదోవిధంగా జరుగుతుంది," అన్నాడు కాలభైరవస్వామి సౌమ్యంగా.

అంతలో బయట మైకులో ఏదో చెప్పుకుపోతున్నారు.

స్వామీజీ మాటలు ఆపి, శ్రద్ధగా ఆలకించసాగారు.

"కర్నాటక స్టేట్ లాటరీ బంపర్ ప్రయిజు 10 లక్షలు.

ఎల్లుండే డ్రా. ఒక్క రూపాయతో లక్షాధికారులుకండి. ఆలసించిన ఆశాభంగం. ఎల్లుండే డ్రా'' పెద్దగా అరుస్తూ పోతున్నాడు లాటరీ టిక్కెట్ల సేల్స్‌మాన్.

విశ్వనాథరావు స్వామీజీవంక చూశాడు.

''ఏం చేయమంటారో సెలవివ్వండి స్వామీ!''అన్నాడు విశ్వనాథరావు.

బయట మైకులో చెప్పేది వినమన్నట్లుగా సైగ చేశాడు ఆయన గంభీరవదనంతో.

''పదిలక్షలు లాటరీ తగిలితే గదా వస్తుంది''అన్నాడు విశ్వనాథరావు అదివిని.

స్వామీజీ నవ్వి, ''చూడు విశ్వనాథరావు, నువ్వు నాకు ఏదో విధంగా డబ్బు సమకూర్చాలనుకుంటున్నావు. నీకు నామీద వున్న ప్రేమాభిమానాలకు చాలా కృతజ్ఞుడిని. కాని నువు యిస్తానన్న డబ్బు నాకు వూరకనేవద్దు. నీకొక అదృష్టసంఖ్యవున్న టికెట్టు యిప్పిస్తాను. ఆ సంఖ్యమీద మొదటి బహుమతి అంటే దాదాపు పది లక్షలు వస్తుంది.

కాకపోతే నువు వారం రోజులు ఓపిక పట్టాలి. అప్పటికి నువు నాకు యిచ్చిన దానికి రెండింతలు మళ్ళీ నీకు తిరిగి చేరుతుంది. బహుశా నీకు అనుమానం రావచ్చు. అదే టికెట్టుకి బహుమతి వస్తుందని నమ్మకం ఏమిటని? కాని నేను సంఖ్య గుణించి వేస్తే అదితప్పక వచ్చితీరాలి'' చెప్పుకుపోతున్న స్వామీజీ మాటలకు విశ్వనాథరావు అడ్డువస్తూ ''మీరు అంతమాట అనవద్దు. మీశక్తిని నేను తక్కువ అంచనా వేయలేదు'' అన్నాడు విశ్వనాథరావు.

ఆమాట అన్నాడేగాని నిజంగా అనుమానం రాసాగింది విశ్వనాథరావుకి. కొన్ని లక్షల టిక్కెట్లలో ఆ టిక్కెట్టుకే వస్తుందని గ్యారంటీ ఏమిటి?

విశ్వనాథరావు ఆలోచనలు ఆపి తనని తానే తిట్టుకున్నాడు. స్వామీజీ అంత సామాన్యుడు కాడు. దైవాంశ సంభూతుడు. భవిష్యత్‌లో జరిగేవి ఆయనకు బాగా తెలుసు. దానికి రుజువులు కావాలంటే యింతకు ముందు ఆయన తనకు చేసిన ఉపకారాలే.

అసలు స్వామీజీకి యిప్పుడు ఎన్ని లక్షలు కావాలి? నాలుగు అయిదు లక్షలయితే రేపు ఉదయం బాంకినుంచి 'డ్రా' చేసి యివ్వగలడు. మళ్ళీ లాటరీలో ప్రయిజు రాగానే ఆ డబ్బు బ్యాంకిలో జమ చేయవచ్చు యెవరికీ తెలియకుండా.

"ఏమంటావు నాయనా! నువు చేసిన సహాయానికి ప్రతిఫలం ఉండాలనే ఆ విధంగా చెప్పాను" అన్నాడు స్వామీజీ మధ్యలో.

"అలాగే స్వామీ! ఇంతకీ తమకెంత కావాలి?"

"అయిదు లక్షలు. ఇంకో వారంలో అయిదుకుఅయిదు కలుపుకొని పదిలక్షలు నీకు ముడతాయి."

'అలాగే'నని సంతోషంగా ఒప్పుకున్నాడు.

విశ్వనాథరావు ఒప్పుకోగానే స్వామీజీ లాటరీ టిక్కెట్లతన్ని పిలిపించారు. ఏదో సంఖ్యలు లెక్క వేయసాగాడు కళ్ళుమూసుకుని. కొద్దిక్షణాల అనంతరం కళ్ళు తెరిచి లాటరీ టిక్కెట్ల అతనివంక చూసి—

"345785 నెంబరు టిక్కెట్టు వుందా?" అని అడిగాడు.

అతను స్వామీజీని విచిత్రంగా చూసి, గబగబా టిక్కెట్ల నంబర్లు వెతకసాగాడు.

ఒక్క నిముషం తరువాత, "ఆఁ! ఉన్నదండీ! 345785" అంటూ మరింత ఆశ్చర్యపోయాడతను.

"మంచిది. ఆ టిక్కెట్టుతీసి ఆయనకివ్వు" అన్నాడు స్వామీజీ విశ్వనాధరావువంక చూపిస్తూ.

టిక్కెట్టు విశ్వనాధరావుకి యిచ్చి, డబ్బులు తీసుకుని వెళ్ళిపోయాడతను.

"చూడు విశ్వనాధరావు. నిన్ను అదృష్టం తప్పక వరిస్తుంది. ఇంకో వారంలో నువు నీ ఆస్థికి యింకో ఐదు లక్షలు తప్పకుండా కలుపుకుంటావు" అన్నాడు.

"అంతా మీ దయ. రేపు ఉదయం 11 గంటలకు మీకు నేను అయిదులక్షలు అందచేస్తాను."

"అలాగే!" స్వామీజీ విశ్వనాధరావును ఆశీర్వదించి పంపాడు.

7

మర్నాడు 11 గంటలకు విశ్వనాధరావు డబ్బులు స్వామీజీకి అందజేశాడు.

అలవాటు ప్రకారం ఆ మర్నాడు స్వామీజీ దర్శనం కోసం వచ్చాడు. కాని అక్కడ యెవరూ లేరు.అక్కడే చిన్నబోర్డు వ్రేలాడగట్టి వుంది.

"స్వామీజీ, బృందంతో సహా పక్కవూరు వెళ్ళారు. రెండురోజులదాకా రారు. భక్తులు గమనించ ప్రార్థన" అని వ్రాసివుంది.

వారం రోజులు గడిచాయి.

స్వామీజీ రాలేదు.

ఆరోజు ఉదయం పోస్టుమాన్ ఉత్తరాలు అందించి వెళ్ళిపోయాడు. అందులోంచి ఒక కవరుతీసి చింపి చదవ సాగాడు.

"పిచ్చి విశ్వనాధరావూ!

ఈ ఉత్తరం వ్రాసింది ఎవరో తెలియక ఆశ్చర్యపోతున్నావు కదూ! మానవత్వంతో మనుషులను నమ్మలేక, కేవలం పాపభీతితో దొంగసాధువులను నమ్మే నీలాంటి వ్యక్తులకు గుణపాఠం చెప్పటానికే 'స్వామీజీ' అవతారం ఎత్తిన 'కుమార్'ని నేను.

ఆరోజు మీకు గుర్తుందనుకుంటాను. స్వయం ఉపాధి పథకం కింద ఒక షెడ్యూల్డు బ్యాంకువారు నాకు ఇరవై వేలు అప్పుగా మంజూరు చేశారు. అయితే సంఘంలో ఒక పెద్దమనిషి నాకు 'రిఫరెన్సు' యివ్వాలన్నారు.

పెద్దమనుషులతో పరిచయాలుంటే బ్యాంకు లోన్లు ఎందుకు? అయినా ఆశ ఊరుకోదుగదా! అయిదేళ్ళబట్టి ఎదురు బొదురు యిళ్ళల్లో ఉంటున్నాం. ఆమాత్రం 'రిఫరెన్సు' యివ్వలేరా అని వచ్చి మిమ్మల్ని అడిగాను.
కానీ, నీవేమన్నావో గుర్తుందా! తెల్లవారి లేచిన తరువాత వందల మందిని చూస్తూంటాను. అందులో నువ్వొకడివి! అంటూ నిరసనగా మాట్లాడావు. 'నీలో ఏంచూసి నమ్మి నీకు రిఫరెన్సు యివ్వమంటావు?' అంటూ అవహేళనగా మాట్లాడావు.

ఆనాడే అనుకున్నాను. నీనుండి గొప్ప రిఫరెన్సు పొందాలని.

పథకం వేసుకొన్నాను. పటిష్టంగా అమలు జరిపాను.
నీకు యింకా ఆశ్చర్యంగా వుండవచ్చు. నా యింటి ఎదురుగా గుడిసెలో వుండే కుమార్, స్వామీజీగా మారటం భవిష్యత్ చెప్పటం, నేను నిజంగా స్వామిజీనని నిన్ను నమ్మించటం.

ఇవన్నీ ఎలా జరిగింది నీకు యింకా అర్థంకాకపోవచ్చు. అవన్నీకూడా వివరిస్తున్నాను. చదివి జన్మ తరింపచేసుకో!

మొదటిది కారు ఏక్సిడెంటు. ప్రతిరోజూ నువ్వు యింటిలో బయలుదేరినప్పట్నించి రోజూ నిన్నూ, నీ కారుని సెకండ్లతో సహా గమనించేవాడిని. నువ్వు సరిగ్గా ఏక్సిడెంటు జరిగిన టర్నింగు దగ్గరకు రావడానికి సరిగ్గా ఇరవై మూడు నిమిషాలు పడుతుంది.

సరిగ్గా అదే సమయంలో అక్కడ ఒక రిక్షా అతనితో ఒప్పందం కుదుర్చుకుని, నీ కారుతో ఏక్సిడెంటు జరిపించాను. ఆ సంఘటనతో నీలో బీజం నాటగలిగాను.

రెండవది పాముకాటు! నిజానికి నేను, నీకు యిచ్చినది విషహారిణి కాదు, తలనొప్పి మాత్రలపొడి! ఆ పొడినే నువ్వు విషహారిణి అనుకొని నీళ్ళలో వేసుకుని తాగావు.

నేను ప్రతిరోజూ నిన్ను గమనిస్తూనే వున్నాను. నీవు యింకో రెండురోజులలో పెళ్ళికి వెళ్తావని తెలుసుకొని, వెంటనే పాములవాడితో సంప్రదించి, కోరలు లేని పాముతో నిన్ను కరిపించాను.

మూడవది కోర్టుకేసు! నీ ఆస్తివిషయం కోర్టులో నడుస్తున్నదని తెలుసుకున్నాను. జడ్జిదగ్గర టైపిస్ట్-కం-పి.ఏ.గా పనిచేసే అతనితో స్నేహం సంపాదించాను. మెల్లమెల్లగా నీకేసు సమాచారం అతనినుంచి సేకరించాను.

ఆ తరువాత మొన్న లాటరీటిక్కెట్ల వాడినికూడా నేనే ఏర్పాటు చేశాను.

ఇంతకుమించి నాలో ఏ దైవాంశ లేదు. నేను యే దేముడ్ని గురించి తపస్సుచేయలేదు.

నాలో ఏంచూసి మీరు అయిదులక్షలు యిచ్చారో తెలియదుగాని, ఒకటిమాత్రం మీకు హామీ ఇవ్వగలను.

ఈ అయిదులక్షలు ఏదో ఒకనాడు తిరిగి మీకు చెల్లించగలను. సెలవు!

—కుమార్."

ఉత్తరం చదవటం పూర్తికాగానే నెత్తి నోరుబాదుకున్నాడు విశ్వనాథరావు.

"ఏం జరిగిందండీ, ఎవరు పోయారు? కొంపదీసి మీ నాన్నగారు పోలేదుకదా ఏడుస్తున్నారు." లోపలనుంచి హడావుడిగా బయటకు వచ్చింది విశ్వనాథరావు భార్య.

"నాన్న పోతే ఏడుపెందుకే పిచ్చిమొహమా! అయిదు లక్షలు పోయాయి" అంటూ ఏడుస్తూనే జరిగింది చెప్పాడు విశ్వనాథరావు.

"అయ్యో! అయ్యో! మీ తెలివి మండిపోను. వెంటనే పోలీసులకు వెళ్ళి చెప్పండి" అరుపులు ప్రారంభించింది ఆమె.

గబగబ బయటకు పరుగుతీయబోయిన విశ్వనాథరావుకి గుమ్మంలోనే ఎదురయ్యాడు మెసెంజర్.

"సార్! మీకు టెలిగ్రామ్" అని యిచ్చి వెళ్ళిపోయాడు.

వణుకుతున్న చేతులతో టెలిగ్రాంవిప్పి చదివాడు విశ్వనాథరావు.

"345785—నంబర్ వన్ ది బంపర్ ప్రయిజు టెన్ లాఖ్స్ ఇన్ కర్ణాటక స్టేట్ లాటరీ"

—: అయిపోయింది :—